క్లుప్తంగా

రామాలయం పునః ప్రతిష్ఠోత్సవం ప్రారంభం



నాగాయలంక: స్థానిక తిప్పాలెంలో పునర్నిర్మితమైన రామాలయం, విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు బ్రహ్మశ్రీ గుండేపూడి నాగరాజ శేఖరశర్మ బ్రహ్మత్వంలో గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. పది జంటలు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమా బాబూరావు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



నాగాయలంక: స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు పోసిన 67మంది రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.99,624లను గురువారం అందజేశారు. పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదరకృష్ణ గోపీనాథ్, సంఘ అధ్యక్షుడు తలశిల బాబూరావు, రూట్ సూపర్వైజర్ ఎం.వరప్రసాద్, సంఘం పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

స్వమిత్వపై ముగిసిన శిక్షణ



పెడన: వైఎస్సార్ శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం స్వమిత్వపై కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు ఈఓపీఆర్డీలకు ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. మొదటి రోజు 23న మచిలీపట్నం జెడ్పీ కన్వెన్షన్‌హాల్‌లో థియరీకి సంబంధించి శిక్షణ ఇవ్వగా రెండో రోజు గురువారం పెడన మండలం నేలకొండపల్లిలో క్షేత్రస్థాయిలో పరిశీలన శిక్షణ పొందారు. మాస్టర్ ఆఫ్ ట్రైనీస్ బి. రాజేంద్రబాబు, పి. హరీష్, వరుణ్, హరికృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

పంటల నమోదు తప్పనిసరి

కోనేరుసెంటర్: రైతులు తమ పంటలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి. హరిక అన్నారు. పొట్లపాలెం గ్రామంలో గురువారం ఆమె పంట నమోదు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ సమీపంలోని ఆర్‌బీకేల్లో తమ పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో ప్రభుత్వం నుంచి అందించే 14-35-14, 10-26-26, 20-20-0-13 రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పొట్లపాలెం సర్పంచ్ గాజుల నాగరాజు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

జయహో భారత్.. జయహో ఇస్రో

- మార్మోగిన విద్యార్థుల నినాదాలు
- ఆకట్టుకున్న భారీ జాతీయ పతాకాలు
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

అవనిగడ్డ: జయహో భారత్, జయహో ఇస్రో నినాదాలు అవనిగడ్డలో గురువారం మార్మోగాయి. ఐదు వేల మంది విద్యార్థులతో చంద్రయాన్ -3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, డీఎస్పీ మురళీధర్‌తో పాటు పలు విద్యా సంస్థల నిర్వాహకులు ర్యాలీలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా సాగింది. ఈ సందర్భంగా వంతెన సెంటర్‌లో భారీ జాతీయ పతాకాల ప్రదర్శన దేశభక్తిని పెంపొందించింది.

భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఇస్రో

చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతంతో భారతదేశ ఖ్యాతిని ఇస్రో శాస్త్రవేత్తలు విశ్వవ్యాప్తం చేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక రాజీవ్‌చౌక్‌లో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చంద్రయాన్ 3 విజయం ప్రతి ఒక్క భారతీయుడు గర్వించదగ్గ విజయమన్నారు. మనదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో నివశిస్తున్న భారతీయులు ఈ విజయంతో సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ విజయం ఇస్రో శాస్త్రవేత్తలు పడిన కష్టాన్ని ప్రపంచ దేశాలన్నీ మన వైపు చూసేలా చేసిందన్నారు. శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులు, ప్రజలతో సంతకాలు సేకరణ చేసి పంపిస్తామని ఎమ్మెల్యే సింహాద్రి తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విద్యా నికేతన్ స్కూల్ విద్యార్థులతో 500 మీటర్ల భారీ జాతీయ పతాక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంఈఓలు నారేపాలెం శివశంకరరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఎస్ఆర్‌ఐ వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. వెంకటేష్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి, డీఎస్పీ మురళీధర్, కడవకొల్లు, విద్యాసంస్థల నిర్వాహకులు, విద్యార్థులు

చల్లపల్లి: చంద్రయాన్ విజయం గర్వకారణమని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి అన్నారు. గురువారం స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో చంద్రయాన్ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. జెడ్పీటీసీ కల్యాణి, సీఐ బి. భీమేశ్వర రవికుమార్ కేక్ కట్ చేశారు. చంద్రయాన్ ప్రయోగం విశేషాలు, ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఫ్రెషర్స్ డే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ దుట్టా ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్టా శివప్రసాద్ పాల్గొన్నారు.



భారీ జాతీయ పతాకంతో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



జాతీయ పతాకాలతో విద్యార్థుల ర్యాలీ

విశ్వకర్మ పథకంలో చేనేతను చేర్చాలని వినతి



రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

పెడన: కేంద్ర ప్రభుత్వం వారసత్వ చేతి వృత్తులను కాపాడేందుకు చేపట్టిన పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజనలో చేతి వృత్తి అయిన చేనేత రంగాన్ని చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనందప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ నెల 23వ తేదీన విశాఖపట్నంలో ఎంపీని కలిసి సమస్యలను వివరించామని చెప్పారు. చారిత్రక నేపథ్యం ఉన్న చేనేతను కేంద్రం విస్మరించడం బాధాకరమని, వెంటనే స్పందించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విశ్వకర్మ పథకంలో చేనేతను చేర్చేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు ఉన్నారని ఆనంద ప్రసాద్ తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో కొత్త సేవలను సద్వినియోగం చేసుకోండి

పెడన: రాష్ట్ర ప్రభుత్వం అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 102 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు అనుసంధానించిన మరో రెండు కొత్త సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరబిందో కంపెనీ ప్రతినిధి, 104 మచిలీపట్నం డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ (ఓఈ) కాలారి శ్రీనివాస పెరుమాళ్లు కోరారు. గురువారం పెడన మండలం పెద నందమూరు గ్రామంలో 104 సంచార వైద్యశిబిరం, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉమెన్, సీవియర్ ఎనీమియా ప్రెగ్నెన్సీ ఉమెన్‌లకు ఈ రెండు రకాల సేవల్లో హెచ్‌ఆర్‌పీడబ్ల్యూ సేవల కింద నెలలు నిండిన గర్భిణీని ప్రభుత్వ వైద్యాధికారుల సూచనలతో డెలివరీ అయ్యే తేదీకి వారం రోజులకు ముందే 102 వాహనం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలోకి చేరుస్తారని చెప్పారు. ఎస్‌ఏపీడబ్ల్యూ సేవల కింద సివియర్ ఎనీమియా.. అంటే అధిక రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించిన ప్రభుత్వ వైద్యాధికారులు వారికి రక్తం ఎక్కించడానికి సూచించిన ఆస్పత్రులకు వారిని 102 వాహనాల్లో తీసుకువెళ్లి ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత వారిని సురక్షితంగా మళ్లీ 102 వాహనంలో వారి ఇండ్లకు చేరుస్తారని వివరించారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందించారు. వైద్యాధికారి మీనాదేవి పాల్గొన్నారు

పీహెచ్‌సీల్లోనే డెలివరీకి చర్యలు

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే డెలివరీలు జరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, శిశు, మహిళా సంక్షేమం, జగనన్నకు చెబుదాం, పాఠశాల విద్య, నాడు - నేడు రెండో దశ పనులు తదితర అంశాలపై సమీక్షించారు. కృష్ణా జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ జూలై నెలలో 56 డెలివరీలు మాత్రమే జరిగాయని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎస్ కలెక్టర్‌కు సూచించారు. సమస్యాత్మకం కాని డెలివరీలు పీహెచ్‌సీల్లోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వారికి వివరించారు. హైరిస్క్ కేసులు మాత్రమే సీహెచ్‌సీలకు, జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నామని చెప్పారు. ప్రమాదం ఎక్కువ ఉన్న డెలివరీల్లో మరణాలు సంభవించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న కిషోర బాలికలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలతో పాటు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. నాడు-నేడు రెండో దశ పనులతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం ప్రాధాన్యత పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపవుట్లపై పరిశీలన, బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సీఎస్‌కు వివరించారు.

పొగాకు వాడకం ప్రమాదకరం



వర్క్‌షాపునకు హాజరైన పోలీసు అధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు

కోనేరుసెంటర్: పొగాకు వాడకాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. బహిరంగ ధూమపానం, విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తుల అమ్మకాల నియంత్రణపై రాష్ట్ర ప్రజారోగ్య శాఖ, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశపుహాల్‌లో జిల్లాలోని పోలీసు సిబ్బందికి వర్క్‌షాపు జరిగింది. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో అనేకమంది పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మనిషికి క్యాన్సర్ అనేది 40 శాతం పొగాకు వాడకం వలనే వస్తోందని చెప్పారు. నూటికి 90 శాతం నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లకు పొగాకు వాడకమే కారణమవుతోందన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని అరికట్టటం ద్వారా పిల్లలు, యువత శ్రేయస్సును కాపాడేందుకు కాట్పా చట్టాన్ని కఠినంగా అమలు చేయడంలో పోలీసులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తుల ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఆరోగ్య, విద్యా శాఖలు అన్ని జిల్లాల్లో పొగాకు రహిత విద్యా సంస్థ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీహరిబాబు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరిపే వారిపై పోలీసు శాఖ కఠినమైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ పెద్దిరాజులు, జిల్లాల్లోని సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్‌ఐలు, డాక్టర్ సౌజన్య, డాక్టర్ కార్తీక్, డాక్టర్ రత్నగిరి, ఎస్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కౌన్సిల్‌హాల్ నిర్మాణం





నూతన కౌన్సిల్‌హాల్‌లో సీలింగ్ పనులు చేస్తున్న కార్మికులు : అభివృద్ధి చేసిన మేయర్ చాంబర్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం కౌన్సిల్‌హాల్ అధునాతన సౌకర్యాలతో రూపుదిద్దుకుంటోంది. రూ. 25 లక్షలతో కౌన్సిల్ హాల్ నిర్మాణం వేగంగా జరుగుతోంది. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు గతంలో 36, 42 మంది కౌన్సిలర్లకు సరిపడే విధంగా మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌ను రూపొందించారు. మునిసిపాలిటీ నగర పాలక సంస్థగా రూపాంతరం చెందడంతో 50 మంది కార్పొరేటర్లతో పాటు ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

కార్యాలయంలో ఉన్న కౌన్సిల్‌హాల్ సమావేశానికి ఇరుకుగా మారింది. దీంతో క్యాటిల్ డిపో వద్ద ఉన్న ఈ-సేవా కేంద్రం భవనాన్ని కౌన్సిల్ హాల్‌గా మార్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. సుమారు రూ. 25 లక్షల వ్యయంతో ఈ-సేవా కేంద్ర భవనంలో అధునాతన హంగులతో కౌన్సిల్ హాల్‌ను ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. నూతన మేయర్ ప్రమాణ స్వీకారోత్సవం నాటికి కౌన్సిల్‌హాల్ నిర్మాణం పూర్తిచేసేలా పనులు వేగంగా చేస్తున్నారు.

కౌన్సిల్‌హాల్‌లో అధునాతన హంగులు..

నూతన కౌన్సిల్‌హాల్‌ను అధునాతన హంగులతో ఏర్పాటు చేస్తున్నారు. హాల్‌కు సీలింగ్, ఏసీలు, మేయర్ పోడియం, మేయర్ రూమ్, కార్పొరేటర్లకు, మేయర్‌కు అధునాతన కుర్చీలు, టేబుల్స్, సౌండ్ సిస్టమ్, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

మేయర్ చాంబర్ అభివృద్ధి..

నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉన్న మేయర్ చాంబర్‌ను ఆధునికీకరిస్తున్నారు. నూతన సీలింగ్‌తో పాటు పీవీసీ ఫ్రేమ్‌లతో ఆధునికీకరించారు. నూతన సీలింగ్ లైట్లను ఏర్పాటు చేశారు.

బీఎల్‌ఓలకు అవగాహన

బంటుమిల్లి: ఓటర్ల నమోదు ప్రక్రియపై బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని బీఎల్‌ఓలకు అవగాహన సమావేశం గురువారం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఓటర్ల నమోదులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సవరణలు చేయాలని చెప్పారు. రెండు చోట్ల ఓట్లు ఉంటే ఓటరు నిర్ణయం మేరకు బీఎల్‌ఓ ధ్రువీకరించుకుని ఒక్కచోట ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా నిబంధనలు అతిక్రమించవద్దని, వివాదాలకు ఆస్కారం ఇవ్వవద్దని హెచ్చరించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను తహసీల్దార్లు ఎంవీ సత్యనారాయణ, రామకోటేశ్వరరావు, బీఎల్‌ఓలు, సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళ ఫోన్‌కు అసభ్య మెసేజ్‌లు

నిందితుడిపై కేసు నమోదు

పెడన: ఒక మహిళను సెల్ ఫోన్లలో వేధిస్తున్న వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 19వ వార్డుకు చెందిన రత్నకుమారి రెవెన్యూ సెక్రటరీగా విధులు నిర్వహిస్తోంది. అదే వార్డుకు చెందిన ముచ్చు వెంకటసాయి ఆమె ఫోన్‌కు అసభ్య పదజాలంతో కూడిన మెసేజ్‌లను పంపి వాటిని తన ఫోన్‌లో డిలీట్ చేసేవాడు. రత్నకుమారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినపాండ్రాకలో పొలంబడి



కృత్తివెన్ను: రైతులు తాము సాగు చేస్తున్న పొలంలోని పంటను నిత్యం పరిశీలించాలని మండల వ్యవసాయాధికారి ఎస్. జెన్నీ అన్నారు. చినపాండ్రాక గ్రామంలో పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఆమె రైతులకు పొలం వద్దనే సాగు ప్రక్రియతో పాటు తెగుళ్లు, నివారణ, సస్యరక్షణ పద్ధతులను వివరించారు. పంటలకు తెగుళ్ల ఆశిస్తే వెంటనే గుర్తించి సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారుల సలహాలు తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు రసాయనిక ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువుల వైపే మొగ్గుచూపాలని చెప్పారు. రైతులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: బోన్ మ్యారో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆరేళ్ల చెన్నూరి యదువీర్ శస్త్ర చికిత్సకు గానూ నగరంలోని ఆర్కే విద్యాసంస్థల అధినేత బండి రామకృష్ణ గురువారం రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కోవిడ్ సమయంలో తండ్రిని కోల్పోయిన యదువీర్‌కు బోన్ మ్యారో క్యాన్సర్ రావడంతో తమిళనాడు వెల్లూరు హాస్పటల్‌లో జూలై 18వ తేదీన చేరాడు. శస్త్రచికిత్సకు దాదాపు రూ. 30 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆస్పత్రి అధికారులు వెల్లడించడంతో బాలుడి బంధువు వేము కోటేశ్వర రావు బండి రామకృష్ణను కలిసి విషయం చెప్పడంతో ఈ మొత్తాన్ని అందజేశారు. బాలుడి శస్త్ర చికిత్సకు అవసరమైన ఎముకను తల్లి ప్రశాంతి దానం చేస్తుండటం గమనార్హం. దాతలు సెల్: 99867 96221 నంబరుకు ఆర్థిక సాయం అందించాలని బాలుడి తల్లి ప్రశాంతి కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నంటౌన్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలరావు, ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్ మాట్లాడారు. సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ జయరావు, టీఎన్‌టీయూసీ నాయకుడు పంచపర్వాల కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కోడూరు: కోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ పాండురంగారావు గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశంలో పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

నేడు పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు

బంటుమిల్లి: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం గూడూరు మండలంలోని పాఠశాలలకు ఐచ్ఛిక సెలవును ఇచ్చామని ఎంఈఓ బి.శేఖర్‌సింగ్ తెలిపారు. ఈ సెలవును వినియోగించుకునే ప్రధాన ఉపాధ్యాయులు స్టూడెంట్స్ యాప్‌లో పొందుపరచాలని, లేకపోతే ఆప్‌సెంట్ పడే అవకాశముందని చెప్పారు.

బాల్య వివాహాలు నేరం

చల్లపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు గురువారం స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ బాల్యంలో వివాహాలు జరిగితే ఆర్థికంగా, చట్టపరంగా, శారీరకంగా ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థి దశలో మంచి ప్రతిభ చూపి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, ప్రిన్సిపాల్ శాంతి విశాల, మహిళా పోలీసులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.